
సాక్షి
బాపట్ల
గురువారం । 17 । ఏప్రిల్ । 2025



గుణదలకు క్రైస్తవుల పాదయాత్ర

దుగ్గిరాల: ఆర్‌సీఎం మత పెద్దలు, దీక్ష తీసుకున్న క్రైస్తవులు బుధవారం గుణదల మేరీమాత పుణ్యక్షేత్రానికి డాక్టర్ సురేష్ యామర్తి ఆధ్వర్యాన పాదయాత్ర చేశారు.



సాగర్ నీటిమట్టం

విజయపురిసౌత్: నాగార్జునసాగర్ జలాశయ నీటిమట్టం బుధవారం 515.00 అడుగుల వద్ద ఉంది. ఇది 140.3150 టీఎంసీలకు సమానం.

సంకటహర చతుర్థి పూజలు



అమరావతి: అమరావతి అమరేశ్వరాలయంలోని విఘ్నేశ్వరుడి ఉపాలయంలో బుధవారం సంకట హర చతుర్థి పూజలు ఘనంగా నిర్వహించారు. అర్చకుడు శేషసాయిశర్మ ఆధ్వర్యంలో ఏకాదశ రుద్రాభిషేకం కూడా చేశారు.

న్యూస్‌రీల్

బాపట్ల జేసీ ప్రఖర్‌జైన్ బదిలీ



బాపట్ల: బాపట్ల జిల్లా జాయింట్ కలెక్టర్ ప్రఖర్‌జైన్‌ను బదిలీ చేస్తూ ప్రభుత్వం బుధవారం ఉత్తర్వులు జారీ చేసింది. ప్రఖర్‌జైన్‌ను ఆర్‌జీఎస్ సీఈవోగా నియమిస్తూ ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. 2021 ఐఏఎస్ బ్యాచ్‌కు చెందిన ప్రఖర్‌జైన్ గతేడాది ఆగస్టులో బాపట్ల జిల్లా జేసీగా బాధ్యతలు స్వీకరించారు. గతేడాది లంక గ్రామాలకు కృష్ణానది ముంపు సందర్భంగా ఆయన చేసిన సేవలకు ప్రశంసలు అందుకున్నారు. బాపట్ల జిల్లా జేసీగా ప్రభుత్వం ఇంకా ఎవరినీ నియమించలేదు.

సబ్ జైలులో జిల్లా జడ్జి పరిశీలన




రేపల్లె రూరల్: రేపల్లె సబ్ జైల్‌ను జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి, జిల్లా సీనియర్ సివిల్ జడ్జి సయ్యద్ జియావుద్దీన్ బుధవారం సందర్శించారు. జైలు పరిసరాలను, ఖైదీల గదులను, సీసీ కెమెరాల పనితీరును పరిశీలించారు. ఖైదీలతో మాట్లాడారు. నేరం ఆరోపించబడి ప్రైవేటు న్యాయవాదిని ఏర్పాటు చేసుకోలేని వారి కోసం ప్రభుత్వం ఉచిత న్యాయ సేవలు అందించేందుకు ప్రభుత్వ న్యాయవాదిని ఏర్పాటు చేసిందన్నారు. అవసరమైన వారు ప్రభుత్వ న్యాయవాది సేవలను వినియోగించుకోవాలని చెప్పారు. కార్యక్రమంలో ప్యానెల్ న్యాయవాది గుమ్మడి కుమార్‌బాబు, సబ్ జైల్ సూపరింటెండెంట్ ఎం.వెంకటేశ్వర రావు తదితరులు పాల్గొన్నారు.

అకాల వర్షంతో దెబ్బతిన్న పంటలు



యద్దనపూడి: యద్దనపూడి మండలంలోని పూనూరు, చింతగుంటపాలెం, గన్నవరం గ్రామాల్లో బుధవారం తెల్లవారుజామున కురిసిన అకాల వర్షానికి ఆరుగాలం శ్రమించి పండించిన పంట కల్లాల్లో తడిసి ముద్ద కావటంతో రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. పండించిన పంటకు గిట్టుబాటు ధర లేక ఇబ్బందులు పడుతుంటే అకాల వర్షంతో మరింత నష్టం చేకూరిందని వాపోతున్నారు. సుమారు 2 గంటలపాటు ఎడతెరిపి లేకుండా కుంభవృష్టిగా వర్షం పడటంతో కల్లాల్లో ఆరబోసిన మిర్చి, మొక్కజొన్న, పందిళ్లపై ఉన్న పొగాకు పంటలు పూర్తిగా తడిసిపోయాయి. తద్వారా పంటకు బూజు, ఫంగస్ పట్టి పంట నాణ్యత దెబ్బతింటుందని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వం తమను ఆదుకోవాలని కోరుతున్నారు.

వైభవంగా విగ్రహ ప్రతిష్ట మహోత్సవం



పిడుగురాళ్ల : పట్టణంలోని శ్రీ రామ తీర్థ సేవాశ్రమం బజార్‌లోని శ్రీ మేధా దక్షిణామూర్తి విగ్రహ ప్రతిష్ట మహోత్సవం బుధవారం వైభవంగా నిర్వహించారు. ఇటీవల ఆలయ పునర్నిర్మాణం చేపట్టారు. బుధవారం గాయత్రి పీఠం ప్రధాన అర్చకులు విష్ణువర్ధన్ శర్మ శాస్త్రోక్తంగా పూజలు నిర్వహించి మేధా దక్షిణామూర్తి విగ్రహాన్ని ప్రతిష్ఠించారు. ఈ సందర్భంగా పూజలు నిర్వహించారు. అనంతరం కందుల శ్రీనివాసరావు తండ్రి జ్ఞాపకార్థం రూ. 17 లక్షలను ఆలయ పునర్నిర్మాణానికి అందించారు. వేలమంది భక్తులకు మహా అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు.

కేరళకు తరలిస్తున్న గోవులు పట్టివేత

మంగళగిరి: నగర పరిధిలోని కాజ టోల్‌గేట్ వద్ద 30 గోవులను పట్టుకున్నారు. శ్రీకాకుళం నుంచి కేరళకు గోవులను తరలిస్తున్నారనే సమాచారం మేరకు బుధవారం వీహెచ్‌పీ నేతలు టోల్‌గేట్ వద్ద కాపలా వుండి 30 గోవులను తరలిస్తున్న కంటైనర్‌ను, డ్రైవర్ అన్సారీని పట్టుకుని మంగళగిరి రూరల్ పోలీసులకు అప్పగించారు. పోలీసులు గోవులను గో ఆశ్రమానికి తరలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

ముడుపుల పే..కాట!

అధికారంలో ఉన్నాం.... మేం ఏం చేసినా చెల్లుబాటు అవుతుందనేలా కూటమి నేతలు ఇష్టానుసారంగా పేకాట కేంద్రాలను నిర్వహిస్తున్నారు. ధనార్జనే లక్ష్యంగా పేకాటతోపాటు కోడి పందేలు కూడా నిర్వహించి జేబులు నింపుకొంటున్నారు. రేపల్లె నియోజకవర్గంలో తెలుగు తమ్ముళ్ల జూదం నిర్వహణ మూడు పువ్వులు, ఆరు కాయలుగా సాగుతోందనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

రేపల్లె నియోజకవర్గంలో జోరుగా జూదం





పేకాటకు అడ్డాగా మారిన ధూళిపూడి పాత సినిమా హాలు

- నగరం మండలంలో అతిపెద్ద పేకాట క్లబ్
- వెలమవారిపాలెం కేంద్రంగా చేతులు మారుతున్న రూ.కోట్లు
- దాడులు జరగకుండా టీడీపీ ముఖ్య నేతకు భారీగా ముడుపులు
- పేకాట కేంద్రాల వైపు కన్నెత్తి చూడని పోలీసు అధికారులు
- వెంటనే తగిన చర్యలు చేపట్టాలని కోరుతున్న ప్రజలు

రేపల్లె రూరల్: నియోజకవర్గ ప్రజలకు జూదాన్ని అలవాటు చేసిందే టీడీపీ అని ప్రజలు చర్చించుకుంటున్నారు. సంక్రాంతి సంబరాల పేరుతో కోడి పందేలు, పేకాట, గుండాట, కోత ముక్క.. ఇలా జూద క్రీడలను బహిరంగంగా నిర్వహించిన ఘనత కూడా తమ్ముళ్లదేనని ప్రజలు మండిపడుతున్నారు. మళ్లీ అధికారంలోకి రావడంతో వారు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. నియోజకవర్గంలోని నగరం, రేపల్లె, చెరుకుపల్లి, నిజాంపట్నం మండలాల్లో విచ్చలవిడిగా పేకాట కేంద్రాలను ఏర్పాటు చేశారు. భారీ స్థాయిలో పై పందేలు జరుగుతున్నా పట్టించుకునే వారే కరవయ్యారని స్థానికులు వాపోతున్నారు. ముఖ్యంగా పేకాట కేంద్రాలకు నిలయంగా నగరం మండలం మారిందనే వాదనలు బలంగా వినిపిస్తున్నాయి.

తమ్ముళ్ల అడ్డాలు ఇవే..

- మండలంలోని ఏలేటిపాలెం గ్రామ పంచాయతీ పరిధిలోని వెలమవారిపాలెం శివారులో టీడీపీ నేతకు చెందిన ఇంట్లో పెద్ద జూద కేంద్రాన్ని (పేకాట క్లబ్) ఏర్పాటు చేశారు. ఇక్కడికి రాష్ట్రం నలుమూలల నుంచి పేకాటరాయుళ్లు వస్తున్నారు. నిత్యం రూ. కోట్లలో పందేలు జరుగుతున్నా సంబంధిత అధికారులు తమకేం పట్టనట్లు వ్యవహరిస్తున్న తీరుపై అనుమానాలు రేకెత్తుతున్నాయి. అనుమతులు లేకుండా కాయిన్స్‌తో పేకాట శిబిరాన్ని నడుపుతున్నారు.
- వెలమవారిపాలెంలోని సపోటా తోటల్లోనూ టీడీపీ నేతల ఆధ్వర్యంలో జోరుగా పేకాట కేంద్రాలు నిర్వహిస్తున్నారు. కూటమి అధికారంలోకి వచ్చిన నాటి నుంచి ఇక్కడ బహిరంగంగా పేకాట కేంద్రాలు నిర్వహిస్తున్నా ఇప్పటి వరకు కనీసం తనిఖీలు జరగలేదంటే పరిస్థితి అర్థం చేసుకోవచ్చు. పేకాట కేంద్ర నిర్వాహకులు ఎలా లాబీయింగ్ చేస్తున్నారనే దానికి ఇదే నిదర్శనంగా ప్రజలు చెబుతున్నారు.
- గత నెల రోజులుగా ధూళిపూడి పాత సినిమా హాలును అడ్డాగా చేసుకుని పేకాట కేంద్రాన్ని నడుపుతున్నారు. ఇటీవల వేమూరు నియోజకవర్గంలో డ్రోన్ కెమెరాలతో పోలీసులు రైడింగ్ చేసి పేకాట కేంద్రాల నిర్వాహకులను అదుపులోకి తీసుకున్నారు. ఇక్కడ ఇప్పటి వరకు మాత్రం తనిఖీలు చేసిన పాపాన కూడా పోలేదు. దీనిపై ప్రజలు బహిరంగంగా విమర్శలు కురిపిస్తున్నారు.

పచ్చ నేతకు భారీగా ముడుపులు

నియోజకవర్గంలో పేకాట కేంద్రాలపై పోలీసులు రైడింగ్ చేయకుండా పచ్చ పార్టీలోని ముఖ్య నేతకు ఆయా పేకాట కేంద్రాల నిర్వాహకులు భారీ స్థాయిలో ముడుపులు సమర్పించుకుంటున్నారనే ప్రచారం విస్తృతంగా జరుగుతోంది. నగరం మండలంలోని వెలమవారిపాలెంలో పేకాట కేంద్రం నుంచి రోజుకు రూ.లక్షల్లో ముడుపులు అందిస్తున్నారని వాదనలు వినిపిస్తున్నాయి. పోలీసులు పేకాట కేంద్రాలపై దాడులు జరగకుండా ఈ ముఖ్య నేత అడ్డుపడుతున్నారనే విమర్శలు వస్తున్నాయి. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి పేకాట కేంద్రాలపై దాడులు నిర్వహించాలని, జూదాన్ని పూర్తిస్థాయి అరికట్టాలని స్థానికులు కోరుతున్నారు.

రైతులను ఆదుకోకుంటే పోరుబాట

- 'సూపర్ సిక్స్' అమలు లేదు.. గిట్టుబాటు ధరలైనా కల్పించండి
- అకాల వర్షానికి దెబ్బతిన్న పంటలను ప్రభుత్వమే కొనుగోలు చేయాలి
- వైఎస్సార్ సీపీ బాపట్ల జిల్లా అధ్యక్షుడు మేరుగ నాగార్జున
- జిల్లా కలెక్టర్ దృష్టికి అన్నదాతల సమస్యలు



మాట్లాడుతున్న మేరుగ నాగార్జున

మార్టూరు: అబద్ధపు హామీలతో ప్రజలను మోసగించి అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం రైతులకు గిట్టుబాటు ధరలైనా కల్పించి ఆదుకోవాలని, లేకుంటే పోరుబాట తప్పదని మాజీ మంత్రి, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ బాపట్ల జిల్లా అధ్యక్షుడు మేరుగ నాగార్జున హెచ్చరించారు. మార్టూరు మండల కన్వీనర్ జంపని వీరయ్య చౌదరి ఆధ్వర్యంలో బుధవారం మార్టూరులో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎన్నడూ లేని విధంగా ప్రస్తుతం పొగాకు, మిర్చి, శెనగ, వరి తదితర రైతులు గిట్టుబాటు ధరలు లభించక వీధిన పడే పరిస్థితి వచ్చిందని ఆరోపించారు. మిర్చి, పొగాకు రైతులకు పెట్టుబడి వ్యయం ఎకరాకు రూ.లక్ష నుంచి రూ.2 లక్షల అవుతోందని గుర్తుచేశారు. వాటిని కొనుగోలు చేసే నాథుడే కరవయ్యాడని ఆయన విమర్శించారు. రైతాంగాన్ని మభ్యపెట్టడం కోసం సీఎం చంద్రబాబు గిట్టుబాటు ధరల కోసం కేంద్రానికి లేఖలు రాసి చేతులు దులుపుకొంటున్నారని ఆరోపించారు. పంటలను ప్రభుత్వమే ఎందుకు కొనుగోలు చేయదని ఆయన ప్రశ్నించారు. ధరల స్థిరీకరణ నిధి ఏర్పాటు చేసి రైతులను ఆదుకుంటామని చంద్రబాబు ఇచ్చిన హామీ ఏమైందని ఆయన ధ్వజమెత్తారు. ప్రభుత్వమే పంట బీమా చేయించి ఆదుకోవాల్సిందిపోయి బీమా రుసుము భారం రైతులపై వేసి చోద్యం చూస్తోందని ఆయన విమర్శించారు. దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర రెడ్డి హయాంలోగానీ, ఆయన కుమారుడు వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి హయాంలోగానీ పండుగలా వ్యవసాయం సాగిందన్నారు. సాగంటే నేడు దండగలా మారటానికి చంద్రబాబు అనాలోచిత నిర్ణయాలే కారణమని ఆయన అన్నారు. అమరావతి భూములతో రియల్ ఎస్టేట్ వ్యాపారంపై ఉన్న శ్రద్ధ ఆరుగాలం కష్టపడే రైతులపై, వ్యవసాయంపై లేకపోవడం దారుణమని నాగార్జున మండిపడ్డారు.

అకాల వర్షంతో దీనావస్థలో రైతులు

మంగళవారం రాత్రి మార్టూరు మండలంలో కురిసిన అకాల భారీ వర్షానికి మొక్కజొన్న, పొగాకు, మిర్చి పంటలను కల్లాల్లో ఆరబెట్టుకున్న రైతుల బాధలు వర్ణనాతీతమని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ జె. వెంకట మురళికి ఫోన్ ద్వారా మార్టూరు పరిసర ప్రాంతాల రైతుల సమస్యలను నాగార్జున వివరించారు. రైతులను అన్నివిధాలా ఆదుకోవాలని కోరారు. అధికారులను బాధిత రైతుల వద్దకు పంపి పంట నష్టం తెలుసుకుంటామని కలెక్టర్ హామీ ఇచ్చారు. ప్రభుత్వానికి నివేదిక పంపి రైతులను ఆదుకుంటామని తెలిపారు.

పార్టీని బలోపేతం చేయండి

తనను కలిసిన పార్టీ నాయకులు, కార్యకర్తలతో నాగార్జున మాట్లాడుతూ... పర్చూరు నియోజకవర్గ ఇన్‌చార్జి మధుసూదన్ రెడ్డితో కలిసి నియోజకవర్గంలో పార్టీ బలోపేతానికి కృషి చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు పఠాన్ కాలేషావలి, నాయకులు ఉప్పలపాటి అనిల్, గర్నెపూడి రవి చందు, అడకా గంగయ్య, తమ్ములూరి సురేష్, మైల నాగేశ్వరరావు, అట్లూరి సుకుందరావు, వంకాయలపాటి భాగ్యారావు, గద్దం మస్తాన్ వలి, దివ్వె కిషోర్, సులేమాన్ ఖాదర్ బాషా, కొండ మస్తాన్, కొమెర శ్రీను, రావిళ్ల అంజిబాబు, మోషే నాయక్, బాజీ నాయక్, కోటి, అజీమ్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజా సమస్యలు తెలుసుకునేందుకు పల్లె పడక

- కూటమి పాలనలో అన్ని వర్గాలకు ఇబ్బందులే
- వారి కష్టాలు తెలుసుకునేందుకు ప్రత్యేక కార్యక్రమం
- వైఎస్సార్ సీపీ రేపల్లె నియోజకవర్గ సమన్వయకర్త డాక్టర్ ఈవూరు గణేష్



రేపల్లె రూరల్: కూటమి ప్రభుత్వ పాలనలో అన్ని వర్గాల ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని వైఎస్సార్ సీపీ రేపల్లె నియోజకవర్గ సమన్వయకర్త డాక్టర్ ఈవూరు గణేష్ ఆరోపించారు. చెరుకుపల్లి మండలం గుల్లపల్లిలోని పార్టీ క్యాంపు కార్యాలయంలో బుధవారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కార్పొరేట్ వ్యక్తులకు కొమ్ముకాయడమే కాకుండా పేదలను ఇబ్బంది పెట్టేలా కూటమి పాలన ఉందన్నారు. పది నెలల పాలనపై ప్రజల్లో తీవ్ర వ్యతిరేకత వచ్చిందన్నారు. గ్రామస్థాయి నుంచి ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలు తెలుసుకోవడంతోపాటు ప్రభుత్వ వైఫల్యాలపై అవగాహన కల్పించేందుకు ఈ నెల 18వ తేదీన 'పల్లె పడక' కార్యక్రమాన్ని ప్రారంభించనున్నట్లు ఆయన వెల్లడించారు. చెరుకుపల్లి మండలం అల్లావారిపాలెంలో ఆ రోజు కార్యక్రమాన్ని ప్రారంభిస్తామన్నారు. అదే రోజు గ్రామంలో పర్యటించి ప్రజల సమస్యలను తెలుసుకుంటామని తెలిపారు. రాత్రికి గ్రామంలో బస చేసి, ప్రజలతో మమేకమై అక్కడే నిద్రించనున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

కాటేసిన కరెంట్ తీగ

చేనేత కార్మికుడు మృతి

వేటపాలెం: అకాల వర్షం కారణంగా కరెంట్ తీగ రూపంలో చేనేత కార్మికుడిని మృత్యువు కాటేసింది. ఈ సంఘటన దేశాయిపేట పంచాయతీ ఆణుమల్లిపేటలో బుధవారం తెల్లవారుజామున చోటుచేసుకుంది. స్థానికుల వివరాల మేరకు.. తెల్లవారుజామున గాలితో కూడిన వాన కురిసింది. ఈదురు గాలులకు కరెంట్ షార్టు సర్క్యూట్‌తో ఇంటికి వేసిన సర్వీస్ వైరు తెగి రోడ్డుపై పడింది. ఉదయాన్నే పాలు తెచ్చుకోవడానికి బొడ్డు మోహన్‌రావు (64) రోడ్డుపైకి వచ్చాడు. రోడ్డుకు అడ్డుగా పడి ఉన్న కరెంటు తీగను పక్కకు తొలగించే ప్రయత్నం చేశాడు. తెగి పడిన సర్వీస్ వైరులో విద్యుత్ ప్రవహిస్తుండటంతో షాక్‌తో అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయాడు. స్థానికులు గుర్తించి విద్యుత్ శాఖ సిబ్బంది సమాచారం అందించారు. వారు విద్యుత్ సరఫరా నిలిపివేశారు. సమాచారం అందుకున్న ఎస్సై ఎం.వెంకటేశ్వర్లు సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. మోహన్‌రావు చేనేత మగ్గం పని చేసుకుంటూ జీవనం సాగిస్తుంటాడు. అతనికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు.



తెగిపడిన విద్యుత్ వైరును పరిశీలిస్తున్న ఎస్సై వెంకటేశ్వర్లు

తాగునీటి సమస్య లేకుండా చర్యలు తీసుకోవాలి

- నీటి ఎద్దడి నివారణకు ముందస్తు ప్రణాళిక
- జిల్లా కలెక్టర్ జె. వెంకట మురళి
- కృష్ణా పశ్చిమ డెల్టా నుంచి నీటి విడుదలకు ఆదేశం



సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్

బాపట్ల: వేసవిలో తాగునీటి సమస్య లేకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ జె. వెంకట మురళి అధికారులకు సూచించారు. బుధవారం స్థానిక కలెక్టరేట్లోని వీడియో కాన్ఫరెన్స్ హాల్లో ఇరిగేషన్, ఆర్‌డబ్ల్యూఎస్ శాఖ ఏఈలు, డీఈలు, రెవెన్యూ డివిజన్ అధికారులు, మున్సిపల్ కమిషనర్లు, అన్ని మండల ఎంపీడీవోలతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లాలోని వాటర్ ట్యాంకులు, సమ్మర్ స్టోరేజ్ ట్యాంక్‌ల వివరాలు, నీటి నిల్వలపై కలెక్టర్ ఆరా తీశారు. జిల్లాలో కెడబ్ల్యూడీ కింద 75 వాటర్ ట్యాంకులు ఉన్నాయని అధికారులు చెప్పారు. వాటిలో 53 ట్యాంకులు 90 శాతం, 15 ట్యాంకులు 20 – 50 శాతం, 7 ట్యాంకులు 25 శాతంలోపు నీళ్లు కలిగి ఉన్నాయని తెలిపారు. అదేవిధంగా 3 సమ్మర్ స్టోరేజ్ ట్యాంకులకుగాను బాపట్లలో 33 శాతం, రేపల్లెలో 44 శాతం, చీరాలలో 73 శాతం నీటి నిల్వలు ఉన్నాయని కృష్ణ పశ్చిమ డెల్టా ఎస్ఈ వెంకట్ రత్నం వివరించారు. ఎన్ఎస్‌పీ కింద జిల్లాలో 40 ట్యాంకులు ఉన్నాయని చెప్పారు., వాటిలో నీరు 45 రోజులపాటు సరిపోతాయని ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్ఈ అనంతరాజు తెలిపారు. బాపట్లలోని సమ్మర్ స్టోరేజ్ ట్యాంకులోని నీరు వారంపాటు అవసరాలకు మాత్రమే సరిపోతుందని, రేపల్లెలో నీరు నెలపాటు, చీరాలలోని నీరు 120 రోజుల పాటు అవసరాలకు సరిపోతుందని మున్సిపల్ కమిషనర్లు వివరించారు. బాపట్ల మున్సిపాలిటీ పరిధిలోని ప్రజలకు నీరు అవసరం ఉన్నందున కృష్ణా పశ్చిమ డెల్టా నుంచి నీటి విడుదలకు చర్యలు తీసుకోవాలని ఇరిగేషన్ అధికారులను జిల్లా కలెక్టర్ ఆదేశించారు. ఆ నీటిని పశ్చిమ డెల్టాకు విడుదల చేసిన మూడు రోజుల తరువాత బాపట్లకు వస్తాయని, పశ్చిమ డెల్టాకు 15 రోజులపాటు నీరు విడుదల జరుగుతుందని అధికారులు తెలిపారు. నీరు బాపట్లకు చేరిన తర్వాత ఎప్పటికప్పుడు ట్యాంకులను నీటితో నింపాలన్నారు. వేసవిలో నీటి సమస్యలు తలెత్తకుండా ముందస్తు ప్రణాళికలతో పని చేయాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీ విఠలేశ్వర్, జిల్లా రెవెన్యూ అధికారి డి.గంగాధర్ గౌడ్, బాపట్ల రెవెన్యూ డివిజనల్ అధికారి పి.గ్లోరియా, బాపట్ల మున్సిపల్ కమిషనర్ రఘునాథ్ రెడ్డి, ఇరిగేషన్, ఆర్‌డబ్ల్యూఎస్ శాఖ ఏఈలు, డీఈలు, వీసీ ద్వారా రేపల్లె, చీరాల రెవెన్యూ డివిజన్ అధికారులు, అద్దంకి, రేపల్లె మున్సిపల్ కమిషనర్లు, అన్ని మండల ఎంపీడీవోలు తదితరులు పాల్గొన్నారు.

నీటి తీరువా వసూళ్లు పెంచాలి

బాపట్ల: గత బకాయిలతో కలిపి నీటి తీరువా రూ.15.46 కోట్లు వసూలు చేయాల్సి ఉందన్నారు. ప్రస్తుతం జిల్లా వ్యాప్తంగా రూ.2.26 కోట్లు మాత్రమే వసూలు చేయడమేంటని అధికారులను జిల్లా కలెక్టర్ జె. వెంకట మురళి ప్రశ్నించారు. రెవెన్యూ అంశాలపై ఆర్‌డీఓలు, తహసీల్దార్లతో బుధవారం స్థానిక కలెక్టరేట్ నుంచి వీక్షణ సమావేశం ద్వారా ఆయన సమీక్ష నిర్వహించారు. రైతులను చైతన్యపరచి నీటి తీరువా వసూలు చేయాలని అధికారులను ఆదేశించారు. నివాస భూమి లేని పేదలందరికీ ఇంటి స్థలం పంపిణీకి ప్రభుత్వం అనుమతులు ఇచ్చిందని, దరఖాస్తులను పరిశీలించాలని ఆదేశించారు.

మాతాశిశు మరణాలను నివారించాలి

మాతాశిశు మరణాలు సంభవించకుండా చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ జె. వెంకట మురళి డాక్టర్లను ఆదేశించారు. గత సంవత్సరం ఆగస్టు మాసంలో సంభవించిన 2 ప్రసవ మరణాలపై జిల్లా కలెక్టర్ మాతాశిశు మరణాల కమిటీ సభ్యులతో బుధవారం కలెక్టర్ క్యాంపు కార్యాలయంలో సమీక్ష నిర్వహించారు. నిడమానూరు గ్రామానికి చెందిన మానికల లక్ష్మి మృతికి సంబంధించి తొమ్మిదో ప్రసవం అని, ఎక్కువ రిస్క్ ఉందని నమోదు చేయడాన్ని పరిశీలించారు. వైద్య అందించిన తీరుపై అసహనం వ్యక్తపరిచారు. సంబంధిత డాక్టర్లు, సిబ్బందిపై తగు చర్యలను తీసుకోవాలని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారిని ఆదేశించారు. కారుమూరి ఆశ మరణంపై ఆరా తీశారు. ప్రసవం తర్వాత ఆమె డయేరియాతో చనిపోయారని రేపల్లె కమ్యూనిటీ హెల్త్ సెంటర్ డాక్టర్లు వివరించారు. కార్యక్రమంలో జిల్లా వైద్య శాఖ అధికారి డాక్టర్ విజయమ్మ, డాక్టర్ రామకృష్ణ, వైద్యం అందించిన డాక్టర్లు, కమ్యూనిటీ హెల్త్ అధికారులు, హెల్త్ ఎడ్యుకేటర్లు, పబ్లిక్ హెల్త్ నర్సులు, హెల్త్ ప్రోగ్రామర్, ఏఎన్ఎంలు పాల్గొన్నారు.



సమీక్ష నిర్వహిస్తున్న జిల్లా కలెక్టర్ జె.వెంకట మురళి

మద్యం మత్తులో సముద్రంలోకి దిగితే కఠిన చర్యలు

- బహిరంగ ప్రదేశంలో మద్యం తాగినా జైలు శిక్ష తప్పదు
- మహిళలతో అసభ్యంగా ప్రవర్తిస్తే సహించేది లేదు
- బీచ్ సందర్శకులకు జిల్లా ఎస్పీ తుషార్‌డూడీ హెచ్చరిక
- నిర్దిష్ట లోతును సూచించేలా జెండాల ఏర్పాటు

బాపట్ల టౌన్: మద్యం మత్తులో సముద్రంలోకి దిగే వ్యక్తులపై కఠిన చర్యలు తప్పవని, ఈ మేరకు పోలీసు అధికారులు తగిన చర్యలు తీసుకోవాలని జిల్లా ఎస్పీ తుషార్‌డూడీ తెలిపారు. బుధవారం సూర్యలంక తీరంలో జిల్లా ఎస్పీ పర్యటించారు. తీరంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అధికారులు, గజ ఈతగాళ్లకు దిశానిర్దేశం చేశారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ... సూర్యలంక బీచ్ పర్యాటకంగా ఎంతో ప్రఖ్యాతిగాంచిందన్నారు. వేసవి కావడంతో యాత్రికుల సంఖ్య మరింత పెరిగే అవకాశం ఉందన్నారు. దానికి అనుగుణంగా సందర్శకుల రక్షణ కోసం పటిష్ట భద్రతా చర్యలు తీసుకున్నామని పేర్కొన్నారు. తీర ప్రాంతంలో పోలీస్ గస్తీని ముమ్మరం చేయడంతోపాటు బీచ్‌లో యాత్రికులు ప్రమాదాలకు గురైనప్పుడు వారిని రక్షించేందుకు స్థానిక, మెరైన్ పోలీసులతోపాటు గజ ఈతగాళ్లు అప్రమత్తంగా ఉండాలన్నారు. ఎక్కువ లోతులోకి వెళ్లే వారిని సులభంగా గుర్తించి అప్రమత్తం చేసేందుకు డ్రోన్‌లను వినియోగించాలని పేర్కొన్నారు. సముద్ర తీరాలకు విహారానికి వచ్చే యాత్రికులు పోలీస్ శాఖ సూచనలను తప్పనిసరిగా పాటించాలన్నారు. సముద్రంలో నిర్దిష్ట లోతు దాటి లోపలకి వెళ్లకుండా యాత్రికులను అప్రమత్తం చేస్తూ సముద్రంలో జెండాలు ఏర్పాటు చేయాలని పేర్కొన్నారు. యాత్రికులు బీచ్ పరిసరాల్లో వ్యవహరించాల్సిన తీరును వివరిస్తూ తీరంలో ప్రచార బోర్డులను ఏర్పాటు చేయాలని సూచించారు. లోతుకు వెళ్తున్న యాత్రికులను అడ్రెస్సింగ్ సిస్టమ్ ద్వారా ఎప్పటికప్పుడు హెచ్చరిస్తూ ఉండాలన్నారు. గజ ఈతగాళ్లు, పోలీస్ సిబ్బంది లైఫ్ జాకెట్స్ ధరించి అప్రమత్తంగా ఉండాలని పేర్కొన్నారు. అత్యవసర పరిస్థితుల్లో యాత్రికులను మెరుగైన చికిత్స నిమిత్తం వైద్యశాలకు తరలించేందుకు అంబులెన్స్‌లు సిద్ధంగా ఉంచుకోవాలన్నారు. బీచ్ పరిసరాల్లోని బహిరంగ ప్రదేశాల్లో మద్యం తాగకుండా, ఇతర అసాంఘిక కార్యకలాపాలు జరగకుండా పోలీస్ గస్తీ ముమ్మరం చేయాలని తెలిపారు. మహిళా యాత్రికులు దుస్తులు మార్చుకొనుటకు తాత్కాలిక గదులను ఏర్పాటు చేయించాలని పేర్కొన్నారు. వాటి వద్ద మహిళా పోలీసులతో బందోబస్తు ఏర్పాటు చెయ్యాలన్నారు. ఈ కార్యక్రమంలో బాపట్ల డీఎస్పీ రామాంజనేయులు, ఎస్‌బీ సీఐ నారాయణ, బాపట్ల రూరల్ సీఐ శ్రీనివాసరావు, పోలీస్ అధికారులు, మెరైన్ పోలీసులు, గజ ఈతగాళ్లు పాల్గొన్నారు.



తీరంలోని గజ ఈతగాళ్లు, సిబ్బందికి సూచనలిస్తున్న ఎస్పీ తుషార్‌డూడీ

క్లుప్తంగా

డెయిరీ ఫామ్‌లో కార్మికుడు మృతి

అద్దంకిరూరల్: బతుకు తెరువు కోసం బిహార్ రాష్ట్రం నుంచి వచ్చి డెయిరీ ఫామ్‌లో పనిచేస్తున్న కార్మికుడు ప్రమాదవశాత్తు మృతి చెందిన సంఘటన బుధవారం అద్దంకి మండలంలోని మణికేశ్వరం గ్రామంలో చోటుచేసుకుంది. సేకరించిన వివరాల మేరకు... బిహార్ రాష్ట్రానికి చెందిన వ్యక్తి బికాస్ జయదేవ్ (22) మణికేశ్వరం గ్రామంలోని ఓ డెయిరీ ఫామ్‌లో కొంత కాలంనుంచి పనిచేస్తున్నాడు. ప్రమాద వశాత్తు మిషన్‌ల వద్ద కిందపడి మృతి చెందాడు. సమాచారంతో అద్దంకి సీఐ సుబ్బరాజు, ఎస్ఐ ఖాదర్ బాషా సంఘటనా స్థలానికి చేరుకుని ప్రమాద తీరును పరిశీలించి కేసుదర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం అద్దంకి ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు.

ఏఎన్‌యూలో నేడు వార్షికోత్సవం

ఏఎన్‌యూ: ఆచార్య నాగార్జున యూనివర్సిటీ ఆర్ట్స్, కామర్స్ అండ్ లా, యూనివర్సిటీ సైన్స్ కళాశాల, యూనివర్సిటీ ఫార్మసీ కళాశాలల యాన్యువల్ డే సెలబ్రేషన్స్ గురువారం జరుగుతాయని వేడుకల కన్వీనర్ ఆచార్య ఎం.త్రిమూర్తిరావు, ఆచార్య సీహెచ్ లింగరాజు, డాక్టర్ డి.రవిశంకర్ రెడ్డి తెలిపారు. వేడుకలకు ముఖ్య అతిథిగా పంచాయతీ రాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ కమిషనర్ ఎం.కృష్ణ తేజ, విశిష్ట అతిథిగా హైదరాబాద్ సీఎస్‌బీ అకాడమీ ప్రతినిధి ఎం.బాలలత, చీఫ్ ప్యాట్రన్‌గా వీసీ ఆచార్య కె.గంగాధరరావు, పాట్రన్స్‌గా రెక్టార్ ఆచార్య కె.రత్నషీలామణి, రిజిస్ట్రార్ ఆచార్య జి.సింహాచలం, ఓఎస్‌డీ ఆచార్య ఆర్‌వీఎస్ఎస్ఎన్ రవి కుమార్, గౌరవ అతిథులుగా ప్రిన్సిపాల్స్ ఆచార్య ఎం.సురేష్ కుమార్, ఆచార్య కె.వీరయ్య, ఆచార్య ఎ.ప్రమీలారాణి హాజరవుతారన్నారు.

ప్రతిష్టాత్మకంగా ఏర్పాట్లు..

యూనివర్సిటీ కళాశాలల యాన్యువల్ డే సెలబ్రేషన్స్‌ను ప్రతిష్టాత్మకంగా నిర్వహించనున్నామని ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య ఎం.సురేష్ కుమార్ తెలిపారు. యూనివర్సిటీలో బుధవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ వేడుకల ఏర్పాట్లకోసం ఆరు ప్రత్యేక కమిటీలను నియమించామన్నారు. యాన్యువల్ డే సెలబ్రేషన్స్ సందర్భంగా నిర్వహించిన పోటీల విజేతలకు వేడుకల్లో బహుమతుల ప్రదానోత్సవం జరుగుతుందన్నారు.

యార్డుకు 1,59,032 బస్తాల మిర్చి



కొరిటిపాడు(గుంటూరు): గుంటూరు మార్కెట్ యార్డుకు బుధవారం 1,59,032 బస్తాల మిర్చి రాగా గత నిల్వలతో కలిపి ఈ–నామ్ విధానం ద్వారా 1,57,640 బస్తాలు అమ్మకాలు జరిగాయి. నాన్ ఏసీ కామన్ రకం 334, నంబర్–5, 273, 341, 4884, సూపర్–10 రకాల సగటు ధర రూ.9,500 నుంచి రూ.13,500 వరకు పలికింది. నాన్ ఏసీ ప్రత్యేక రకం తేజ, బాడిగ, దేవనూరు డీలక్స్ రకాల సగటు ధర రూ.9,800 నుంచి రూ.13,500 వరకు లభించింది. తాలు రకం మిర్చి రూ.4,500 నుంచి రూ.6,500 వరకు ధర పలికింది. అమ్మకాలు ముగిసే సమయానికి యార్డులో ఇంకా 76,896 బస్తాలు నిల్వ ఉన్నట్లు యార్డు ఉన్నతశ్రేణి కార్యదర్శి ఎ.చంద్రిక తెలిపారు.

రెవెన్యూ సేవల్లో అలసత్వం వద్దు

- ఆర్డీఓ చంద్రశేఖర నాయుడు
- చీరాల రెవెన్యూ డివిజన్ పరిధిలోని అధికారులతో సమీక్ష సమావేశం



అధికారులకు సూచనలు చేస్తున్న ఆర్డీఓ చంద్రశేఖర నాయుడు

చీరాల టౌన్: రెవెన్యూ సమస్యల పరిష్కారంలో అశ్రద్ధ వద్దని, వచ్చిన ప్రతి అర్జీని నిశితంగా విచారణ చేయించాలని, విధుల్లో అశ్రద్ధ వహిస్తే శాఖాపరమైన చర్యలు తప్పవని చీరాల ఆర్డీఓ తూమాటి చంద్రశేఖరనాయుడు సూచించారు. బుధవారం రాత్రి చీరాల ఆర్డీఓ కార్యాలయంలో చీరాల రెవెన్యూ డివిజన్ పరిధిలోని చీరాల, కారంచేడు, వేటపాలెం, చినగంజాం, అద్దంకి, పంగులూరు, సంతమాగులూరు. ఇంకొల్లు, బల్లికురవ మండలాల తహసీల్దార్లు, మండల సర్వేయర్లు, రీ సర్వే డీటీలతో రెవెన్యూ సమస్యలు, అర్జీల పెండింగ్‌పై సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. డివిజన్ పరిదిలోని మండలాల వారీగా పెండింగ్‌లో ఉన్న రెవెన్యూ సమస్యలు, రీ సర్వే, పీజీఆర్ఎస్ అర్జీలు, ప్రజాప్రతినిధుల నుంచి వచ్చిన అర్జీలు, ల్యాండ్ కన్వర్షన్, నీటి తీరువా వసూళ్లపై మాట్లాడి పలు సూచనలు చేశారు. ఆర్డీఓ మాట్లాడుతు....మండలాల వారీగా అర్హత ఉండి నివేశన స్థలాలు రాని వారి వివరాలను అందించడంతో పాటుగా కావాల్సిన భూమి వివరాలు అందించాలన్నారు. మండలాల్లో నీటి తీరువా వసూళ్లకు ప్రత్యేక డ్రైవ్ ఏర్పాటు చేసి రైతుల నుంచి విధిగా నీటి తీరువా వసూలు చేయాలన్నారు. రీ సర్వే పకడ్బందీగా చేసి రికార్డుల ప్రకారమే వివరాలు ఆన్‌లైన్ చేయాలన్నారు. రెవెన్యూ సమస్యలను సత్వరం పరిష్కరించాలన్నారు. అర్జీదారులను కార్యాలయాల చుట్టు తిప్పుకోవద్దని ప్రజలకు సత్వరం సేవలందిస్తే మంచి అధికారులుగా గుర్తింపు వస్తుందన్నారు. గ్రామాల వారీగా పెండింగ్‌లో ఉన్న పట్టాదారు పాసు పుస్తకాలను త్వరగా అందించడంతో పాటుగా గ్రామాల్లో ఎక్కడా అనధికార లే అవుట్లు వేయకుండా కట్టడి చేయాలన్నారు. ఓటీసీలను త్వరగా మంజూరు చేయాలన్నారు. సమావేశంలో డివిజనల్ సర్వే ఇన్‌స్పెక్టర్ మునలయ్య, తహసీల్దార్లు గోపికృష్ణ, పార్వతి, ప్రభాకరరావు, నాగరాజు, రీసర్వే డీటీలు, ఇతర రెవెన్యూ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

పట్టణ పరిసరాల్లో తోటల సాగుపై ప్రత్యేక శిక్షణ

వ్యవసాయ కళాశాల డీన్ డాక్టర్ ప్రసూనా రాణి



సమావేశంలో మాట్లాడుతున్న డీన్ డాక్టర్ ప్రసూనా రాణి

బాపట్ల: అర్బన్ కేంద్రాల పరిసరాలలో ఆకు కూరలు, కూరగాయలు, పండ్లు, పూల పెంపకం చేసే విధానం ద్వారా ఆహార భద్రత కలుగుతుందని వ్యవసాయ కళాశాల డీన్ డాక్టరు పి.ప్రసూనా రాణి పేర్కొన్నారు. బాపట్ల వ్యవసాయ కళాశాలలో బుధవారం రైతులతో ఏర్పాటు చేసిన సమావేశంలో డీన్ మాట్లాడారు. కూరగాయాలకు స్థానిక మార్కెట్లలో ప్రాధాన్యత పెరుగుతుందని, సాగు భూమి విస్తీర్ణానికి ఇది ఎంతగానో దోహదపడుతుందని తెలిపారు. పట్టణ పరిసరాలలో జీవించే చిన్న, సన్నకారు రైతుల కమతాలలో పెంచదగిన కూరగాయలు, వాటి సాగులో తీసుకోవలసిన మెలకువలు గురించి శిక్షణ శిబిరంలో తెలియజేశారు. ఉద్యాన విభాగాధిపతి డా. వి.శ్రీలత రైతులకు పూల తయారీ, వాటికి మార్కెట్‌లో ఉన్న ప్రాముఖ్యత గురించి వివరించారు. డా.యస్.రత్నకుమారి, డా.కె.సుశీల, డా.ఎం.సురేష్ కుమార్, ఉద్యాన విభాగ అధ్యాపకులు తదితరులు పాల్గొన్నారు.

సంగీతంలో గిన్నిస్ బుక్ రికార్డు



కర్లపాలెం: కీబోర్డు ప్లే చేసి బాపట్ల జిల్లా కర్లపాలెం మండలం బిడారుదిబ్బ గ్రామానికి చెందిన ఓ విద్యార్థి వరల్డ్ గిన్నిస్ బుక్ సర్టిఫికెట్ అందుకున్నాడు. బాలుడి తల్లిదండ్రులు తెలిపిన వివరాల మేరకు దుండివారిపాలెం పంచాయతీ బిడారుదిబ్బ గ్రామానికి చెందిన కట్టుపల్లి విల్సన్‌బాబు, ప్రత్యూష దంపతుల పెద్దకుమారుడు విజయవాడలో ప్రైవేటు పాఠశాలలో 6వ తరగతి చదువుతున్నే విద్యార్థి జోయెల్ విల్సన్‌బాబు పాస్టర్లు లాభాన్‌రాజు, అగస్టిన్ దండంగి సారథ్యంలో కీబోర్డు వాయించటం నేర్చుకున్నాడు. 2024 డిసెంబర్ 1వ తేదీన విజయవాడలో ప్రపంచ స్థాయిలో 108 దేశాలలో 1090మంది సంగీత కళాకారులకు ఆన్‌లైన్ విధానంలో జరిగిన పోటీలలో జోయెల్ విల్సన్‌బాబు పాల్గొని 45 నిమిషాలలో కీబోర్డు ప్లేచేసి వీడియోను అప్‌లోడ్ చేసి గిన్నిస్‌బుక్ రికార్డు సాధించాడని తెలిపారు. ఈనెల 14వ తేదీన హైదరాబాద్ మణికొండలో జరిగిన కార్యక్రమంలో గిన్నిస్ బుక్ ప్రతినిధి రాజేంద్రన్ చేతుల మీదుగా వరల్డ్ గిన్నిస్ బుక్ రికార్డు సర్టిఫికెట్‌ను అందుకున్నాడని తెలిపారు.

శ్మశాన వాటికకు భూమి కేటాయించాలి

కలెక్టర్‌కు జాతీయ రహదారి విస్తరణ బాధితుల వినతి



కలెక్టర్‌కి వినతిపత్రం ఇస్తున్న కాలనీ వాసులు

చీరాల: వాడరేవు – పిడుగురాళ్ల జాతీయ రహదారి 167 విస్తరణలో కోల్పోయిన శ్మశాన వాటిక భూమిని తిరిగి వేరే ప్రాంతంలో కేటాయించాలని విజయనగర్ కాలనీ వాసులు జిల్లా కలెక్టర్ వెంకట మురళికి బుధవారం వినతిపత్రం అందజేశారు. 1985లో కారంచేడు బాధితులకు చీరాల వద్ద విజయనగర్ కాలనీ ఏర్పాటు చేశారన్నారు. ఈ కాలనీలకు సంబంధించి 8 ఎకరాల్లో శ్మశాన వాటికను అప్పటి ప్రభుత్వం కేటాయించిందని తెలిపారు. ప్రస్తుతం నిర్మిస్తున్న వాడరేవు – పిడుగురాళ్ల జాతీయ రాహదారిలో శ్మశాన వాటిక స్థలంలో చాలావరకు కోల్పోవడం జరిగిందన్నారు. శ్మశానానికి వెళ్లేందుకు దారిని ఏర్పాటు చేయాలని కోరారు. కాలనీ వాసులు తేళ్ల లక్ష్మీప్రసాద్, దేవదానం, ప్రసాద్, దుడ్డు ఏసుపాదం బుడంగుట్ల లక్ష్మీ నరసయ్య, ఎమ్మార్పీఎస్ అధ్యక్షుడు దుడ్డు వందనం, తాళ్లూరి రాజేష్, దుడ్డు వెంకటేశ్వర్లు, చుండూరి రమేష్‌బాబు, తేళ్ల రాంబాబు, దుడ్డు విజయ భాస్కర్ పాల్గొన్నారు.

కీబోర్డులో గిన్నిస్ రికార్డు



పెదకాకాని: మ్యూజికల్ కీ బోర్డులో కొప్పురావూరుకు చెందిన ఉషారాణి రికార్డు సృష్టించి గిన్నిస్ బుక్‌లో స్థానం దక్కించుకుంది. పెదకాకాని మండలంలోని కొప్పురావూరు గ్రామానికి చెందిన టి.ఉషారాణి స్ఫూర్తి మహిళా సంక్షేమ అభివృద్ధి సంస్థ అధ్యక్షురాలిగా పనిచేస్తున్నారు. 2024 డిసెంబరు 1వ తేదీన సాయంత్రం 4 గంటల నుంచి 5 గంటల వరకూ గంట సమయం పాటు 17 దేశాలకు చెందిన 1090 మంది ఒకే టైమ్‌లో నాన్‌స్టాప్‌గా కీ బోర్డు ప్లే చేయడం జరిగింది. ఈ వీడియో రికార్డును నాస్టర్ అగస్టీన్ దండంగి ఆధ్వర్యంలో ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేయడం జరిగింది. వీడియోను వీక్షించిన గిన్నిస్ బుక్ ఆఫ్ వరల్డ్ వారు కొప్పురావూరుకు చెందిన టి.ఉషారాణిని గిన్నిస్‌బుక్ రికార్డు కు ఎంపిక చేయడం జరిగింది. ఈ నెల 15వ తేదీన హైదరాబాద్ మణికొండలో నిర్వహించిన కార్యక్రమంలో అగస్టీన్ దండంగి, బ్రదర్ అనిల్ కుమార్, గిన్నిస్ బుక్ ఆఫ్ వరల్డ్ ప్రతినిధి ఆనంద్ రాజేంద్రన్‌ల చేతుల మీదుగా సర్టిఫికెట్, మెడల్‌ను టి.ఉషారాణికి అందజేశారు.

రేపు వేట విరామభృతికి ఎన్యుమరేషన్ ప్రక్రియ

బాపట్ల: వేట విరామ భృతికి సంబంధించి మత్స్యశాఖ సిబ్బంది సంబంధిత ఫిష్ ల్యాండింగ్ సెంటర్‌లో ఎన్యుమరేషన్ ప్రక్రియను ఈనెల 18వ తేదీన చేపడుతున్నట్లు జిల్లా మత్స్యశాఖ అధికారి కె.శ్రీనివాస నాయక్ ఒక ప్రకటనలో తెలిపారు. స్థానిక ఫిష్‌ల్యాండింగ్ సెంటర్‌లో ఈకార్యక్రమం ఉంటుందని తెలిపారు. బోటు యజమానులు బోటు రిజిస్ట్రేషన్ సర్టిఫికెట్, బోటు లైసెన్సు సర్టిఫికెట్, బోటు యజమాని, సిబ్బంది ఆధార్ కాపీ, బ్యాంక్ పాస్ పుస్తకం మొదటి పేజీతో హాజరుకావాలని సూచించారు.

లంక గ్రామాల ప్రజలకు ఉపాధి కల్పించండి

ఆర్డీఓని కోరిన వైఎస్సార్ సీపీ వేమూరు ఇన్‌చార్జి వరికూటి అశోక్‌బాబు



వేమూరు: లంక గ్రామాల్లో ఇసుక తవ్వకాల్లో యంత్రాలను నిషేధించి కూలీలకు ఉపాధి కల్పించే విధంగా చర్యలు తీసుకోవాలని వైఎస్సార్ సీపీ వేమూరు నియోజక వర్గ సమన్వయకర్త వరికూటి అశోక్‌బాబు రేపల్లె ఆర్డీఓ రామలక్ష్మి దృష్టికి తీసుకెళ్లారు. రేపల్లె రెవెన్యూ డివిజన్ కార్యాలయంలో బుధవారం ఆర్డీఓను కలిసి పలు సమస్యలను ఆమె దృష్టికి తీసుకెళ్లారు. నదీ తీరప్రాంతాల్లో ఇసుక తవ్వకాల్లో యంత్రాలు ఉపయోగించకుండా లంక ప్రాంతాల్లోని కూలీల చేత చేయించాలన్నారు. ఇతర ప్రాంతాలకు అక్రమంగా ఇసుక తరలివెళ్లకుండా అడ్డుకోవాలని ఆయన కోరారు. ఇసుక తరలింపు కోసం కొందరు నదిలో రోడ్లు సైతం వేస్తున్నారని, వారిపై చట్టప్రకారం చర్యలు తీసుకుని, రోడ్లను ఛిద్రం చేయాలన్నారు. ఇసుక తవ్వకాల్లో పూర్తిగా లంక గ్రామాలకు చెందిన కూలీలను వినియోగించాలని ఆయన కోరారు.

పారిశుద్ధ్య కార్యక్రమాలు సక్రమంగా నిర్వహించాలి

జిల్లా పంచాయతీ అధికారి కేఎల్ ప్రభాకర్‌రావు



సమావేశంలో మాట్లాడుతున్న డీపీఓ కేఎల్ ప్రభాకర్‌రావు

కర్లపాలెం: పారిశుద్ధ్య కార్యక్రమాలు సక్రమంగా నిర్వహించాలని జిల్లా పంచాయతీ అధికారి కేఎల్ ప్రభాకర్‌రావు చెప్పారు. దమ్మనవారిపాలెం ఘన వ్యర్థ పదార్థాల నిర్వహణ కేంద్రంలో బుధవారం ఎనిమిది గ్రామ పంచాయతీలలోని పారిశుద్ధ్య కార్మికులకు, పంచాయతీ కార్యదర్శులకు పారిశుద్ధ్య కార్యక్రమాలపై ఒక రోజు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా వచ్చిన డీపీఓ కేఎల్ ప్రభాకర్‌రావు మాట్లాడుతూ గ్రామాలలో పారిశుద్ధ్యం పనుల బాధ్యత గ్రామ పంచాయతీ కార్యదర్శులపై, పారిశుద్ధ్య కార్మికులపై ఉందన్నారు. ప్లాస్టిక్ వాడటం వలన పర్యావరణానికి హాని కలుగుతుందని ప్రజలకు అవగాహన కల్పించాలని చెప్పారు. ఎంపీడీఓ శ్రీనివాసరావు మాట్లాడుతూ గ్రామస్తులు తమ ఇళ్లల్లోని తడిచెత్త, పొడిచెత్తను వేర్వేరు డబ్బాలలో వేసి తమకు అందజేసే విధంగా పారిశుద్ధ్య కార్మికులు ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. గ్రామ సర్పంచ్ గురపుసాల వెంకటేశ్వరమ్మ, ఈఓపీఆర్డీ శ్రీనివాసరావు, కార్యదర్శి తిరుమలరెడ్డి, పారిశుద్ధ్య కార్మికులు పాల్గొన్నారు.

పీఎఫ్ పనులపై వచ్చి ఉపాధ్యాయుడు మృతి

- గుంటూరులోని డీఈఓ కార్యాలయంలో కుప్పకూలిన ఉపాధ్యాయుడు చల్లా వెంకటరెడ్డి
- జూన్‌లో ఉద్యోగ విరమణ చేయాల్సి ఉండగా.. ఇంతలోనే మృత్యువాత



చల్లా వెంకటరెడ్డి (ఫైల్)

గుంటూరు ఎడ్యుకేషన్: బోధన వృత్తిలో సుదీర్ఘ సేవలందించిన ఉపాధ్యాయుడు హఠాన్మరణం చెందారు. పిడుగురాళ్ల మండలం బ్రాహ్మణపల్లి జెడ్పీ ఉన్నత పాఠశాలలో స్కూల్ అసిస్టెంట్‌గా పని చేస్తున్న చల్లా వెంకటరెడ్డి (62) బుధవారం పీఎఫ్ క్లియరెన్స్, ఎన్‌ఓసీ కోసం గుంటూరు డీఈఓ కార్యాలయానికి వచ్చారు. జిల్లా విద్యాశాఖాధికారి కార్యాలయంలోని విజిటర్స్ కుర్చీలో కూర్చుని ఉండగానే, తీవ్రమైన గుండెపోటు రావడంతో ఆయన అక్కడికక్కడే కుప్పకూలిపోయారు. ఆయన వెంట ఉన్న కుమారుడు ప్రసన్నాంజనేయులు రెడ్డితో పాటు డీఈఓ కార్యాలయ సిబ్బంది హుటాహుటిన సమీపంలోని రమేష్ ఆస్పత్రికి తరలించారు. అక్కడి వైద్యులు తక్షణమే సీపీఆర్ చేసినా ప్రయోజనం లేకపోవడంతో ఆయన మృతి చెందారు. విషయం తెలుసుకున్న జిల్లా విద్యాశాఖాధికారి సీవీ రేణుక రమేష్ ఆస్పత్రికి వచ్చి వెంకటరెడ్డి భౌతిక కాయాన్ని సందర్శించారు. ఆయన కుమారుడిని పరామర్శించి, అంబులెన్స్‌లో ఆయన స్వస్థలమైన పిడుగురాళ్ల మండలం కరాలపాడు గ్రామానికి పంపారు. మరో రెండు నెలల్లో ఉద్యోగ విరమణ పొంది, కుటుంబ సభ్యులతో కలసి శేష జీవితాన్ని ఆనందంగా గడపాల్సిన ఉపాధ్యాయుడు ఈ విధంగా హఠాన్మరణం చెందడంతో తోటి ఉపాధ్యాయులు దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. కాగా పీఎఫ్ క్లియరెన్స్, ఎన్‌ఓసీ కోసం నరసరావుపేట డీఈఓ కార్యాలయానికి వెళ్లాల్సిన వెంకటరెడ్డి సరైన సమాచారం లేకపోవడంతో గుంటూరు డీఈఓ కార్యాలయానికి వచ్చి ఈ విధంగా మృతి చెందారు.

తెనాలి డీఎస్పీకి ఏబీసీడీ అవార్డు



డీజీపీ హరీష్‌కుమార్ గుప్తా నుంచి అవార్డు అందుకుంటున్న డీఎస్పీ జనార్ధనరావు, పొన్నూరు రూరల్ సీఐ, చేబ్రోలు ఎస్ఐ, కానిస్టేబుళ్లు


తెనాలి రూరల్: సంచలనం సృష్టించిన దళిత బాలిక హత్య కేసును ఛేదించిన తెనాలి డీఎస్పీ బి.జనార్ధనరావు ఏబీసీడీ (అవార్డ్ ఫర్ బెస్ట్ క్రైం డిటెక్షన్) కన్సోలేషన్ ప్రైజ్ అవార్డు (డీజీపీ మెడల్) అందుకున్నారు. గుంటూరు జిల్లా చేబ్రోలు మండలం కొత్తరెడ్డిపాలెంకు చెందిన ఏడో తరగతి చదువుతున్న దళిత బాలిక పేరిపోగు శైలజను గ్యాస్ డెలివరీ బాయ్‌గా పని చేసే కృష్ణా జిల్లాకు చెందిన నరమామిడి నాగరాజు గతేడాది దారుణంగా హత్య చేయడం.. ఘటన రాష్ట్రవ్యాప్తంగా సంచలనంగా మారడం తెలిసిందే. కేసును చేబ్రోలు పోలీసులు నమోదు చేయగా, డీఎస్పీ జనార్ధనరావు దర్యాప్తు చేశారు. హత్యకు పాల్పడి పరారైన నాగరాజు, తన సెల్ ఫోన్, సిమ్‌ను మార్చి వేసి పోలీసులకు సవాల్ విసిరాడు. సుమారు మూడు నెలల పాటు నిందితుడి ఆచూకీ కోసం తీవ్రంగా ప్రయత్నించి అతి కష్టం మీద అతడిని గుర్తించి అరెస్ట్ చేశారు. కీలకమైన కేసును ఛేదించడంలో కృషి చేసిన డీఎస్పీ, చేబ్రోలు పోలీసులను డీజీపీ హరీష్‌కుమార్ గుప్తా అభినందించారు. మంగళగిరిలోని పోలీస్ హెడ్ క్వార్టర్స్‌లో బుధవారం జరిగిన కార్యక్రమంలో తెనాలి డీఎస్పీకి ఏబీసీడీ కన్సోలేషన్ ప్రైజ్ అవార్డును డీజీపీ అందజేశారు. ఈ సందర్భంగా డీఎస్పీకి తెనాలి సబ్ డివిజన్ పోలీస్ అధికారులు, సిబ్బంది అభినందనలు తెలిపారు.

పోలీసులకు అవార్డులు..

చేబ్రోలు: కొత్తరెడ్డిపాలెం గ్రామానికి చెందిన పేరుపోగు శైలజ హత్య కేసులో నిందితుడు ఎన్.నాగరాజు కోసం ప్రత్యేక బృందాలుగా ఏర్పడి సాంకేతిక పరిజ్ఞానంతో నాగరాజును పట్టుకొని అరెస్ట్ చేసి జైలుకు పంపారు. ఈ కేసులో ప్రతిభ కనబరిచిన పొన్నూరు రూరల్ సీఐ వై.కోటేశ్వరరావు, చేబ్రోలు ఎస్ఐ డి.వెంకట కృష్ణ, చేబ్రోలు పీఎస్ కానిస్టేబుళ్లు ఎ.అప్పలనాయుడు, జి.నాగరాజులకు అవార్డులను అందజేసినట్లు పోలీసులు తెలిపారు.

88 ఏళ్ల వృద్ధుడికి అరుదైన ఆపరేషన్

విలేకరుల సమావేశంలో డాక్టర్ ఫణీంద్ర కుమార్ వెల్లడి



డాక్టర్ ఫణీంద్రకుమార్‌ను అభినందిస్తున్న సీనియర్ సినీ నటుడు మురళీమోహన్

గుంటూరు మెడికల్: స్వర పేటికకు పెరాలసిస్ వచ్చి ఎనిమిది నెలలుగా తీవ్ర ఇబ్బంది పడుతున్న 88 సంవత్సరాల వృద్ధుడికి ప్రపంచంలోనే మొట్టమొదటిసారిగా అరుదైన ఆపరేషన్ చేసి గొంతు సమస్యను సరిచేసినట్లు గుంటూరులోని శ్రీ సత్య సాయి ఫణీంద్ర కుమార్ ఈఎన్‌టీ అండ్ వాయిస్ క్లినిక్ అధినేత, వాయిస్ సర్జన్ డాక్టర్ వి.ఫణీంద్ర కుమార్ చెప్పారు. బుధవారం గుంటూరు బ్రాడీపేటలో ఆసుపత్రిలో జరిగిన విలేకరుల సమావేశంలో ఆపరేషన్ వివరాలు ఆయన వెల్లడించారు. కృష్ణా జిల్లా గుడివాడకు చెందిన 88 సంవత్సరాల లక్ష్మణరావు 8 నెలలుగా స్వర పేటిక పెరాలసిస్‌కు గురై మాట రాక ఇబ్బంది పడుతున్నట్లు తెలిపారు. లక్ష్మణరావు కుమారులు అమెరికాలో ఉండటంతో అక్కడికి వెళ్లిన వృద్ధుడు అమెరికాలో వైద్యులను సంప్రదిస్తే ఇండియాలో ఆపరేషన్ చేసే వైద్యులు ఉన్నారని అక్కడే చేయించుకోవాలని సూచించారు. దీంతో లక్ష్మణరావు పిల్లలు ఇండియాలోని తమ బంధువుల సలహా మేరకు ఫిబ్రవరి నెలలో చికిత్స కోసం లక్ష్మణరావును తమ వద్దకు తీసుకువచ్చారన్నారు. వైద్య పరీక్షలు చేసి స్వర పేటిక పెరాలసిస్ వల్ల గొంతు రాకపోవడం, పీలగా మారటం చాలా చిన్నగా మాట్లాడటం వంటి సమస్యలతో బాధపడుతున్నట్లు గుర్తించామన్నారు. ఎలాంటి కారణం లేకుండానే స్వర పేటిక పెరాలసిస్ రావడంతో ఫిబ్రవరి 17న సుమారు రెండు గంటలసేపు థైరోప్లాస్టి ఆపరేషన్ చేసి సమస్యను నివారించామన్నారు. కొద్దిరోజులపాటు వాయిస్ థెరపిస్ట్ పర్యవేక్షణలో లక్ష్మణరావుకు స్పీచ్ థెరపి చేయించడంతో నేడు పూర్తిస్థాయిలో మాట్లాడుతున్నట్లు డాక్టర్ ఫణీంద్ర కుమార్ వెల్లడించారు. మెడికల్ జర్నల్స్ లో 88 సంవత్సరాల వయసున్న వృద్ధుడికి ఆపరేషన్ చేయటం ప్రపంచంలో ఇదే మొట్టమొదటిసారి వెల్లడించారు. ఆపరేషన్ ప్రక్రియలో ఈఎన్‌టీ వైద్యులు డాక్టర్ భార్గవ్, మత్తు వైద్యులు డాక్టర్ సురేంద్ర పాల్గొన్నట్లు తెలిపారు. అరుదైన ఆపరేషన్ చేసి స్వర సమస్యను సరిచేసి మామూలు వ్యక్తి లాగా మాట్లాడే విధంగా చేసిన డాక్టర్ ఫణీంద్ర కుమార్ కు సీనియర్ సినీ నటుడు, లక్ష్మణరావు బావ అయిన మురళీమోహన్ అభినందనలు తెలిపారు.